# 14. ఏమని పాడుదునో, ఈ వేళ?

రోజూ సంగతి ఎలా ఉన్నా ఆదివారం మాత్రం కూరగాయలు తెచ్చేపని నాకే తగులుతుంది, మా ఇంట్లో. ఆ విధంగా బజారుకి వెళ్లగా అక్కడ నరసింగరావు కనబడి "మేం ఇల్లు కట్టించుకుని గృహప్రవేశం అయ్యాక నువ్వు మా ఇంటికి రాలేదు" అని నిష్ఠూరంగా మాట్లాడేడు. "ఔను. ఆ రోజు నేను ఊళ్లో లేను. ఉంటే ఎందుకు రాను?" అని తప్పించుకున్నాను. కానీ అలా నన్ను తప్పించుకోనిస్తే అతను నరసింగరావు ఎందుకవుతాడు! "మా అమ్మాయి పెళ్ళి అయి నాలుగేళ్లయింది. చిన్నప్పుడంతా ఎత్తుకు తిరిగిన వాడివి ఇన్నాళ్లు దాన్ని చూడకుండా ఎలా ఉన్నావు!" అన్నాడు. ఎలా ఉన్నానా - అని ఆలోచించలేదు. మరోసాకు ఏది చెబుదామా అని ఆలోచిస్తూ ఉండగా "ఇప్పుడిక్కడే ఉంది. దానికో కొడుకు పుట్టాడు. వాడికి మూడేళ్లు వెళతాయి ఇవాళ్టికి, పోనీ వాణ్ణి చూడ్డానికైనా రావా?" అన్నాడు నరసింగరావు. "అలాగా! అయితే సాయంకాలం మా ఆవిడా నేనూ వస్తాం" అని మళ్లా తప్పించుకోడానికి ప్రయత్నించేను గానీ, "నువ్విపుడు రా! సాయంకాలం ఆవిడని పంపించు" అని నరసింగరావు నా జెబ్బ పట్టుకుని లాగేడు.

నరసింగరావు మనమడు బొద్దుగా ఎర్రగా బావున్నాడు. "వాళ్ల నాన్న పోలిక!" అని రమణమ్మ మొగుణ్ణి తల్చుకుని మురిసిపోయింది. "మాటలొచ్చాయా?" అని రమణమ్మని అడిగేను. "మాటలేమిటి, పాటలే పాడుతాడు" నా ఒళ్లోంచి వాణ్ణి లాక్కుని "ఏదీ, నాన్నా; తాతయ్య గారు వింటారు, ఓ పాట పాడమ్మా" అని బుజ్జగించింది. వాడు నేలకి దిగి ఒక ఫోజులోకి వచ్చాడు.

"ఎక్కడో చీమ కుట్టింది, ఎక్కడమ్మా ఎక్కడమ్మా ఎక్కడ" అని ముద్దు ముద్దుగా పాడేసి, "ఎలా ఉంది మన పెర్ఫార్మెన్స్?" అని అడిగినట్లు వాళ్లమ్మవైపు, నరసింగరావు వైపు చూసేడు. వాళ్లిదరూ ఏకగ్రీవంగా మెచ్చుకుని "ఇంకొకటి పాడు" అన్నారు.

"అందం ఇందోలం; అసలే చలికాలం" అని పాడేడు పిల్లాడు.

వాళ్లిద్దరూ మళ్లా మెచ్చుకుని "ఇంకోటి; ఇంకోటి" అన్నారు.

"(ముద్దు) పెత్తమంతావా; నువ్వే పెత్తుకుంటావా?" అని పాడి చిన్న డ్యాన్స్ కూడా (స్టెప్స్) వేసేడు.

పిల్లాడు సినీ సంగీత కచేరీ చేస్తున్నాడని కాకపోయినా, రాక రాక నేనొచ్చాను కదా అని నన్ను చూడ్డానికి వచ్చినట్టుగా నరసింగరావు భార్య, రెండో కూతురు, కొడుకు, వాడితో పాటు చదువుకుంటున్న పక్కింటి అబ్బాయి, పెరట్లో ఎక్కడో అంట్లు తోముకుంటున్న పనిమనిషి ఇలా అదనపు ప్రేక్షకులు చేరారు. కుర్రాడి మాట ఎలా ఉన్నా రమణమ్మకి ఆడియన్స్‌ని చూసి అదనపు ఉత్సాహం వచ్చినట్లుంది. "ఇంకో మంచి పాట పాడు నాన్నా..." అని వాడికో ముద్దు పెట్టి అడిగింది.

ఈ మాటు పిల్లాడు కొంచెం పెద్ద పాట పాడేడు.

"కానీ కానీ కానీ కానీ; పోనీ పోనీ పొద్దుపోనీ

ఎప్పుడంటే చెప్పనంతావు; ఒప్పుకుంటే చప్పుడంతావు ॥ పోనీ పోనీ!॥

అందరూ చప్పట్లు కొడుతూంటే నేనూ కొట్టేసేను, "డాన్స్ లాంటిది కూడా చేస్తున్నాడే" అన్నాను, వాణ్ణి మెచ్చుకుంటూ రమణమ్మతో.

"అవును మావయ్యా, వాడికోసం లేటెస్టు రికార్డులో, కేసెట్లో కొని పడేస్తారు వాళ్ల నాన్నగారు. సినిమాకి వెళ్లినపుడు వాణ్ణి తీసికెళ్లకుండా వెళ్తే ఇంక యుద్ధం పెట్టేశాడన్నమాటే!'అంది రమణమ్మ.

"యుద్ధం కాదు. ఫయిటింగ్ మమ్మీ" అని పిల్లాడు వాళ్ళమ్మ తప్పుని సరిచేసి, "నాకు ఫయిటింగ్ కూడా వచ్చు, సిరంజీలాగ!" అన్నాడు.

"సిరంజీ అంటే ఏంటో తెలుసా? హీరో చిరంజీవి అన్నమాట" అని మరుగైపోతున్న నా సినీ పరిజ్ఞానానికి మెరుగు పెట్టింది రమణమ్మ.

పిల్లాడు మళ్లీ పాడుతాడేమోనన్న భయం చేత నేను 'నిత్య జీవితంలో కళల ప్రభావం' అనే టాపిక్ మీద చిన్న ఉపన్యాసం లంకించుకున్నాను. దాంతో పనిమనిషితో సహా అందరూ రంగంలోంచి ఫేడవుట్ అయిపోగా నేనూ నరసింగరావూ మిగిలాం.

నరసింగరావూ నేనూ కాలేజీలో చదువుకునే రోజుల్లో ఏటా కాలేజి ఏనివర్సరీ సందర్భంగా వ్యాసరచన, వాదన మొదలైన ప్రక్రియలతో పాటు పాటల పోటీలు కూడా పెట్టేవారు. పాటల పోటీలకి న్యాయ నిర్ణేతలుగా వచ్చే పెద్దలు సినిమా పాటలు పాటలు కావన్న ధోరణి అవలంబించి ఇక ఏ దారీ లేకపోతే తప్పా సినిమా పాటలు పాడిన వాళ్లకి బహుమతులు ఇచ్చేవారు గాదు. అయితే ఒకసారి నరసింగరావు "మల్లీశ్వరి" సినిమాలో భానుమతి పాడిన "మనసున మల్లెల మాలలూగెనే" అనే పాట పోటీలో పాడితే అతనికి బహుమతి ఇవ్వాలా వద్దా అని పెద్ద తర్జన భర్జన జరగడం, చివరికి ఆ పాటలో మంచి కవిత్వమే కాక చల్లని సంగీతం కూడా ఉందని తీర్మానించి అతనికి బహుమతి ఇవ్వడం జరిగింది.

"మీ మనవడి పాటకేం గానీ, నువ్వు నాకు కొన్ని మంచి పాటలు వినిపించవోయి. ఎలాగా ఒచ్చేను కదా; కొంతసేపు కూర్చుంటాను" అన్నాను.

"ఆఁ, ఇంకా నేను పాడకేమి?" అన్నాడు నరసింగరావు. 'అవన్నీ ఎప్పుడో మరచిపోయాను' అన్నాడు వేదాంతిలాగ.

"ఆ రోజుల్లో కథా క్రమం కోసం సంఘటనలు, ఆలోచనలూ ఆధారంగా రాసినవి కాక కొన్ని భావగీతాలు కూడా సినిమాల్లో పెట్టేవారు. నువ్వు వాట్లో ఎక్స్‌పర్ట్; నాకు గుర్తుంది" అన్నాను.

"నాకు గుర్తు లేదంటున్నానుగా"

"పాట, ఈత, టైపురైటింగ్, సైకిలింగ్ లాంటివి సాంకేతిక విద్యలు. ఒకసారి పట్టుబడితే మరచిపోలేం. సామర్థ్యం సన్నగిల్లి ఉండొచ్చుగాని అసలు మరచిపోడం అనేది అసంభవం" అన్నాను.

"ఈ వనిలో కోయిలనై... కోయిల పాడే గానమునై... గానము కోరే చెవినై,

నా చెవిలో నేనే ధ్వనిస్తా!

మింట చనేమేఘమునై; మేఘము కోరే చంచలనై ... చంచలకోరే గురినై

నా గురిలో నేనే నటిస్తా!''

నలభై ఏళ్లనాటి సినిమా పాట. అంత జ్ఞాపకంతో, అంత సామర్థ్యంతో పాడి; "బాగా పాడలేక పోయాను, అలవాటు తప్పిపోయింది. ఇప్పుడు నన్ను పాడమని ఎవరడుగుతారు?'' అని నొచ్చుకున్నాడు నరసింగరావు.

అలా అన్నాడు కదా అని ఊరుకోలేదు నేను.

"అదిగో అందియల రవళి;

జగమే రాపడిపోయె''

"మామిడి చెట్టును అల్లుకొన్నది

మాధవీ లతొకటి-''

"అందమె ఆనందం

ఆనందమె జీవిత మకరందం''

"చల్లని వెన్నెలలో, చక్కని కన్నె సమీపములో

అందమె నాలో లీనమాయెనే!

ఆనందమె నా గానమాయెనే-''

"ప్రశాంత జగమును హుషారు చేసే -

వసంత ఋతువు నాదేలే

పూవుల ఘుమఘుమల చల్లగ విసిరే-

మలయ మారుతము నాదేలే

కావాలంటే ఇస్తాలే- ; నావన్నీ ఇక నీవేలే!''

"అరుణ కిరణముల గిలిగింతలతో

కరిగిన తెలిమంచు తెరలే తరలి-

తెలియని ఆనందం, నాలో కలిగినదీ ఉదయం-''

"ఊరికే కొలనునీరు ఉలికిపులికి పడుతుంది; ఓరగా నెమలి పింఛ మారవేసుకుంటుంది.''

ఈ పాటలన్నీ మా నరసింగరావుతో పాడించుకుని విన్నాను. మరచిపోయానని అన్నాడే కానీ ఎక్కడా తడుముకోలేదు. "ఇంత బాగా గుర్తున్నాయని కూడా నాకు తెలీదు. నాకు ఆ తియ్యటి జ్ఞాపకాలు తెచ్చినందుకు థాంక్స్'' అన్నాడు నరసింగరావు.

నేను నవ్వాను. "అవన్నీ నీకు గుర్తున్నాయంటే అందులో నీ గొప్పతనం ఏమీ లేదు. అలా గుర్తుండిపోయేటట్టు రాసిన వాళ్లదీ, పాడిన వాళ్లదీనీ ఆ గొప్పతనం!'' అన్నాను.

"అవును సుమీ! ఈ మధ్య వస్తున్న పాటలు కూడా వింటూనే ఉన్నాను గానీ ఏమీ గుర్తుండడం లేదు.'' అన్నాడు నరసింగరావు.

★